## భట్టి విక్రమార్క గెలుపు

# రాష్ట్రానికి మలుపు



## ఏపీసీసీ అధ్యక్షులు రుద్రరాజు



**వనం నాగయ్య, కెరటం న్యూస్**

ఈ ఎన్నికల్లో భట్టి విక్రమార్క మల్లు గెలవడం తెలంగాణకు ఎంతో అవసరమని రాహుల్ గాంధీ తనకు చెప్పారని, అందుకే ప్రచారానికి వచ్చానని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు రుద్రరాజు తెలిపారు. శనివారం ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం, ఖానాపురం, పండ్రేగి పల్లి, కోదండరాంపురం, ముత్తారం, వనం వారి కృష్ణాపురం, కమలాపురం, అయ్యగారి పల్లి, అమ్మపేట, వల్లపురం గ్రామాల్లో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు రుద్రరాజు తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, విజయవాడ సిటీ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితర ఏపీ కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఖానా పురంలో సంఘీభావం తెలిపారు. అంతా భట్టి విక్రమార్కతో కలిసి ఏపీ కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఖానాపురంలో జరిగిన ప్రచార సభలో రుద్రరాజు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా పినపాక రోడ్ షోకు వెళ్లడానికి విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్ట్ లో దిగిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి స్వాగతం పలకడానికి వెళ్లగా పై విషయం తనకు చెప్పాడని వివరించారు. ప్రతిపక్ష నేతగా, ప్రజలగొంతుకగా భట్టి విక్రమార్క అసెంబ్లీలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై గడగడ లాడించారని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో భట్టివిక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన పీపుల్స్‌మార్చ్ పాద యాత్రలో ప్రజల గుండె చప్పుడు విని, వారి సామాజిక స్థితిగతులు తెలుసుకొని రాహుల్ గాంధీకి వివరించగా ప్రకటించినవే ఆరు గ్యారెంటీలు, కాంగ్రెస్ మేనిఫెస్టో అని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కావాల్సిన అన్ని అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందు పరచడాని భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన స్పందనే అన్నారు. ఛత్తీస్గఢ్ హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రకటించిన హామీలను అమలు చేయించిన ఘనత రాహుల్ గాంధీకీ దక్కిందన్నారు. తెలంగాణలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, మేనిఫెస్టో అంశాలు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ అమలు చేయిస్తారని చెప్పారు. యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ప్రధాని మన్మోహన్ నేతృత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో 72 వేల కోట్ల రైతు రుణాలు రద్దు చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని వత్తిడిలు చేసిన గత మూడు పర్యాయలుగా భట్టి విక్రమార్క వెంట ఉన్నందుకు మధిర ప్రజలకు ధన్య వాదాలు తెలిపారు. గాంధీ, నెహ్రూ కుటుంబానికి సన్నిహితులు, జాతీయ స్థాయిలో పలుకుబడి కలిగిన విక్రమార్క రానున్న కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర కానున్నారని వెల్లడించారు. ఉన్నత చదువులు చదువుకొని ప్రజాసేవకే అంకితమై 2007 నుంచి ఇప్పటివరకు మధిరను అభివృద్ధి చేస్తున్న భట్టి విక్రమార్కను గెలిపించుకుంటే నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాబోతుందని బిఆర్ఎస్ వేధింపులకు కాంగ్రెస్ కార్యకర్తలు భయపడవద్దని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు 20 రోజులు కష్టపడితే భట్టి విక్రమార్క మీ పెద్దకొడుకు లాగా ఐదు సంవత్సరాలు మీకోసం పనిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మధిర నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు



